కర్నూలు | నంద్యాల వార్త

25 ఏప్రిల్ , 2023 మంగళవారం పేజీలు 4

మలేరియా, డెంగ్యూ జ్వరాలను పూర్తి స్థాయిలో నియంత్రించాలి..

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్.సృజన

కర్నూలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త : మలేరియా, డెంగ్యూ జ్వరాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వైద్యాధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా లైన్ డిపార్ట్మెంట్ ల అధికారులతో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రాణాంతకమైన వ్యాధులని, వీటిని అరికట్టేందుకు ప్రభుత్వ పరంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం తో పాటు ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు కలుగచేసే దోమలు మంచి నీటిలో మాత్రమే గుడ్లు పెడతాయన్నారు..టైర్స్, కొబ్బరి చిప్పలు, వాడని ఎయిర్ కూలర్స్ లో నిలువ ఉన్న నీటిలో గుడ్లు పెట్టడం వల్ల ఈ వ్యాధులు వస్తాయని, కాబట్టి వీటిని ఇంటి పరిసరాల్లో లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.. ప్రతి శుక్రవారం నీటి నిల్వలను ఖాళీ చేసి, ఆరబెట్టి, నీటి నిల్వల మీద మూత ఉంచుకు నేలా ప్రజలకు అవ గాహన కల్పించాల్సిందిగా లైన్ డిపార్ట్మెంట్ల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యాధుల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ముద్రించిన కరపత్రాలను సచివాలయాలు, వాలంటీర్లు, అంగన్వాడీ, ఆశా, గ్రామ, మండల స్థాయి అధికారుల ద్వారా ఇంటిం టికీ చేర్చి పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.. డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా టీబి అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా మలేరియాఅధికారి డాక్టర్ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

2లో

పట్టా భూములు..
ప్రొహిబిషన్ జాబితా(22ఏ1సి)లోకి..!

- అసలైన హక్కుదారులు పరేషాన్
- కలెక్టర్ ఫేషికి చేరిన 60మంది అర్జీలు
- ఏడాదైనా నిషేధిత జాబితా పరిష్కారం కాని వైనం

2లో

ఆదోని,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : రెవెన్యూ స్టాఫ్ హడావుడిగా చేసిన తప్పిదం కారణంగా అనేకమంది అర్హత కలిగిన భాదితులు ఇబ్బంది పడుతున్నారు. రిజిస్ట్రేషన్ వ్యవస ్థను క్రమబద్ధీకరించే క్రమంలో అసైన్డ్ ల్యాండ్, దేవాదాయ, ఐనామ్, వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వ పోరంబోకు ఇత్యాది భూముల వివరాలను ప్రొహిబిషన్ జాబి తాలోకి చేర్చారు. ఆయా మండల స్థాయిలో ఉన్న రెవెన్యూ సిబ్బంది ద్వారా ఈ జాబితాను సిద్ధం చేయించారు. ఇక్కడే అనేక తప్పి దాలు చోటు చేసుకున్నాయి. ఏదైతే నిషేదిత భూముల సర్వే నంబర్ లకు సరిహద్దుగా ఉన్న పట్టా భూముల సర్వే నంబర్లను సైతం ఈ నిషేదిత (సెక్షన్ 22ఏ1సి) లెక్కలోకి చేర్చేశారు. రెవెన్యూ స్టాఫ్ హడావుడిగా చేసిన పని వలన అసలైన హక్కుదారులు ప్రస్తుతం అవస్థలు పడుతున్నారు. ఈ నిషేధిత జాబితాలోకి పొరపాటుగా చేరిన పట్టా భూముల రిజిస్ట్రేషన్ పూర్తిగా ఆగిపోయింది. రెవెన్యూ స్టాఫ్ పొరపాటుతో పాటు రాజకీయ ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తుంది. కొందరు నేతలు రాజకీయ,రియల్ ఎస్టేట్ వ్యాపార కోణంలో కొన్ని పట్టా సర్వే నంబర్లను రెవెన్యూ సిబ్బంది ద్వారా కావాలనే ప్రొహిబిషన్ జాబితాలోకి ఎక్కించినట్లు ఆరోప ణలు వినిపిస్తున్నాయి. క్రయవిక్ర యాలు జరిగిన కూడా 22ఏ జాబితాలో ఉండడంతో ఈ భూములు రిజిస్ట్రేషన్ కావడం లేదు. దీంతో ఆర్థిక అవసరం కారణంగా భూములు అమ్ముకున్న వారు అవస్థలు పడుతున్నారు. జిల్లా పరిధిలోని ఆయా మండలా లకు చెందిన 60మంది భాదిత హక్కుదారులు తమ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించా లని జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకు న్నారు. గత ఏడాది కాలంగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నిషేధిత జాబితా నుండి పట్టా భూములకు విముక్తి లభించడం లేదని భాదితులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. పట్టా భూములకు సంబంధించిన ఆర్ఓ ఆర్, ఆర్ఎస్ఆర్,హెచ్ఆర్‌లతో..

రాయలసీమ కోసం డూ.. ఆర్ డై..!

- సీమ అభివృద్ధిపై నాయకుల భిన్న స్వరాలు
- అభివృద్ధికై త్వరలో చలో డిల్లీ - బైరెడ్డి
- రాయల తెలంగాణకు మద్దతుగా కార్యాచరణ - జేసీ
- గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం - గంగుల
- భూమి నిష్పత్తి ప్రకారం నీళ్లు - శైలజానాథ్
- రాయలసీమ స్టీరింగ్ కమిటీ కర్తవ్య దీక్ష సక్సెస్

కర్నూలు,ప్రభాతవార్త :

రాయలసీమ అభివృద్ధి కోసం చావో..రేవో తేల్చుకునే సమయం ఆసన్నమైందని రాయలసీమ ప్రాంత నాయకులు ప్రకటించారు. రాయలసీమ అభివృద్ధి కోసం డు ఆర్ డై అనే విధంగా ముందుకు కదలాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. అయితే సీమ అభివృద్ధి విషయంలో నాయకులు భిన్న స్వరాలు విన్పించడం గమనార్హం. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని ఎస్టీ బీసీ కళాశాల మైదానంలో భారీ స్థాయిలో కర్తవ్యం దీక్షను నిర్వహించారు.

• వివరాలు 2లో

నీటి కుంటలో పడి..
విద్యార్థి మృతి..!

దేవనకొండ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త : నీటి కుంటలో పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని కుంకనూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు ఇలా వున్నాయి. కుంకనూరు గ్రామానికి చెందిన కురువ రామప్ప,రత్నమ్మల కుమారుడు కురువ సురేష్ (16)అనే విద్యార్థి స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. సురేష్ అదే గ్రామంలో జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి చదివి ఇటీవల పబ్లిక్ పరీక్షలు కూడా రాయడం జరిగింది. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లి నీటి కుంటలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు కుంటలో ఇరుక్కుపోయాడు. దీనిని గమనించిన స్నేహితులు చుట్టుపక్కల వారికి సమా చారం అందించగా కుంటలో ఇరుక్కుపోయిన విద్యార్థిని బయటకి తీసి చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈత కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి సురేష్ భౌతికకాయాన్ని చూసి అయ్యో పాపం అంటూ గ్రామస్తులు కంటతడి పెట్టారు. కన్న కొడుకు కళ్లెదుటే మృతిచెందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న దేవన కొండ జడ్‌పిటిసి కిట్టు మృతిచెందిన విద్యార్థి సురేష్ భౌతికకాయానికి నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

: రిజెక్షన్, రీ ఓపెన్ ఉండకూడదు - జిల్లా కలెక్టర్ డా.గుమ్మళ్ళ సృజన

కర్నూలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త : స్పందన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను నాణ్యత గా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. గుమ్మళ్ల సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు పరిష్కరించకుండా తిప్పి పంప కూడదని, తమ పరిధిలో లేని సమస్య అయితే అర్జీదారునికి ఆ కారణం స్పష్టంగా చెప్పాలని కలెక్టర్ సూచించారు. అలాగే రీ ఓపెన్ కాకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. నాణ్యమైన పరిష్కారం వల్ల ఫిర్యాదులు రీ ఓపెన్ అయ్యే అవకాశం ఉండద న్నారు. అర్జీదారుల వినతి పత్రాలను ఆయా శాఖల అధికారులకు పంపుతూ గడువు లోపు ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్వో నాగేశ్వర రావు , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పై ముఖ్యనాయకులతో సమీక్షా సమావేశం

- రాష్ట్రంలోనే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మూడవ స్థానంలో నిలిచిన బనగానపల్లె : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె,ఏప్రిల్24,ప్రభాతవార్త: బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బనగానపల్లె నియోజకవర్గంలోని బనగాన పల్లె,అవుకు,కోవెలకుంట్ల,కొలిమిగుండ్ల,సంజామల మండలాల వైసీపీ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమానికి హాజర య్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు ఆదేశాల మేరకు బనగానపల్లె నియోజకవర్గంలో పెద్దఎత్తున చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం రాష్ట్రంలో బనగానపల్లె నియోజకవర్గం మూడవ స్థానంలో నిలిచిందని ఇందుకు కృషి చేసిన మండల సచివాలయ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు,వైసీపీ నాయకులు ,కార్యకర్తల కృషితోనే ఈ రోజు రాష్ట్రంలోనే మూడవ స్థానం సంపాదించడం జరిగిందని ఆయన తెలిపారు.అయితే పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 29వ తేది వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పెంచడం జరిగిందని కాబట్టి ఇంకా నియోజక వర్గంలోని వైసీపీ అభిమానులు, కార్యకర్తలు,గృహసారథులు,వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు అందరు సమిష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి ఇంటికి వెళ్లి 8296082960 అనే నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇప్పించి రాష్ట్రంలోనే మొదటిస్థానాన్ని సంపాదిం చాలని వైసీపీ నాయకులు,కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్ మెగా సర్వేలో కోటి మందికి పైగా ఈ సర్వేలో పాల్గొనడం జరిగిందని దేశ వ్యాప్తంగా ఏ రాజకీయ పార్టీకి కూడా ఇంత మంది సర్వేలో పాల్గొనడం జరగలేదని అది కేవలం ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి,వైసీపీకే దక్కిందని తెలిపారు.అదే విధంగా 2024లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడివలే పోరాటం చేసి మళ్లీ మన జగనన్న ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలుగుదేశం పార్టీ దుష్టచతుష్టాయానికి వ్యతిరేకంగా మనం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కాబట్టి రాజకీయాలకు, పార్టీలకు,కులాలకు,మతాలకు అతీతంగా అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి వెళ్లి వారు ఎంత లబ్ధి చెందారో వారికి సవివరంగా తెలియజే యాలని వారికి మన పార్టీ పట్ల సానుకూలంగా ఉండేటట్లు కార్యక్రమాలు చేపట్టాలని అప్పుడే మనం మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ యువనాయకులు కాటసాని ఓబుళరెడ్డి, వైసీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి,కోవెలకుంట్ల పట్టణ ఉపసర్పంచ్ జి.సి.ఆర్.సూర్య నారాయణ రెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బి.వి.నాగార్జునరెడ్డి,వైసీపీ మైనార్టీ నాయకులు అత్తార్ జాహీద్ హుస్సేన్, కోవెలకుంట్ల మండల వైసీపీ కన్వీనర్ భీమిరెడ్డి నాగప్రతాప్‌రెడ్డి,జిల్లెల్ల శంకరెడ్డి, బనగానపల్లె మండల సచివాలయ కన్వీనర్ గుండం నాగేశ్వరరెడ్డి,అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం,కోవెలకుంట్ల మండల సచివాలయ కన్వీనర్ లాయర్ మధుసూదన్‌రెడ్డి,మండల సచివాలయ కన్వీనర్ దారెడ్డి సుధాకర్‌రెడ్డి,కొలిమిగుండ్ల మండల సచివాలయ కన్వీనర్ మొలక రాజారెడ్డి,బనగానపల్లె నియోజకవర్గం వైసీపీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రూ.13.50 లక్షలతో..
సిసి రోడ్లు ప్రారంభం

నంద్యాల క్రైం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: రూ.13.50 లక్షలతో నూతన సిసి రోడ్లు, 6 కల్వర్టులకు సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. 14వ వార్డులోని సరస్వతీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిం చారు. ఈసందర ్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించారు. ముందుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. నంద్యాలను అభివృద్ధి నడిపిస్తున్నామని తెలిపారు. రాబోయే సంవత ్సరంలోపు నంద్యాల పట్ట ణంలోని రోడ్లు, పనుల నిర్మాణాలను దశలవారిగా పూర్తిచేయి స్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ విమలమ్మ, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీదర్, నాయక్, బాష, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో బైరెడ్డి భేటీ...

మిడుతూరు, ఏప్రిల్24, ప్రభాతవార్త ; రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిద్ధార్థ నందికొట్కూరు నియోజకవర్గం, పట్టణ అభివృద్ధి, ఎత్తిపోతల పథకం, ఇతర అభివృద్ధి పనుల గురించి మాట్లాడి, అదేవిధంగా నియోజకవర్గ రాజకీయ స్థితిగతుల గురించి కూడా సీఎంతో చర్చించినట్లు తెలిసింది.

90 శాతం ఫిర్యాదులు సచివాలయాల్లో పరిష్కారం కావాలి..

- అధికారులు స్థానికంగా నివాసం ఉండాలి
- అత్యవసర సేవల్లో తక్షణమే స్పందించాలి
- జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్

నంద్యాల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: 90 శాతం ఫిర్యాదులు సచివాలయాల్లోనే పరిష్కారం కావాలని, ప్రజలు సంతృప్తి చేందే స్థాయిలో స్పందన సమస్యలు పరిష్కరించాలని, అధికారులు పనిచేసే గ్రామాల్లోనే నివాసం ఉండి అత్యవసర సేవలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటినరీ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టరు నిశాంతి, ఇంచార్జీ డిఆర్వో కామేశ్వర్‌రావు పాల్గొని అర్జీలు స్వీకరిం చారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ తమ పరిధిలోని ఏదైనా సంఘటనలు జరిగితే సంబంధిత..

2లో

పోలీస్ స్పందనకు అపూర్వ ప్రజాస్పందన

-25 ఫిర్యాదుల స్వీకరణ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: జిల్లా కేంద్రమైన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిసోమ వారం జరుగుతున్న పోలీస్ స్పందనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. స్పందనలో 25 ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అనేక సమస్యలతో పోలీస్ స్పందనకు వస్తున్నారు. తక్షణమే పోలీస్ అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారం చూడాలని అధికారులను అదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వద్దని మరో సారి రిపిట్ కాకూడదని హెచ్చరించారు. సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తితగాదాలు, అంతారి ంటి వేదింపులు మొదలగు ఫిర్యాదులున్నాయ న్నారు. ఎండలు అధికంగా ఉన్నాయని ఫిర్యాదు దారులు తమ సబ్‌డివిజన్ పోలీస్ అధికారి నిర్వహిస్తున్న స్పందనలో అర్జీలు ఇవ్వవచ్చని ఎస్పీ తెలిపారు.

కల్తీ మాయ..!

- హోటళ్లలో నాణ్యత లోపించిన ఆహార పదార్థాలు
- కల్తీ నూనెలతో వంటలు
- మచ్చుకైనా కానరాని పారిశుధ్యం
- ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- పుట్టగొడుగుల్లా పుట్టుకోస్తున్న రెస్టారెంట్లు
- అయిల్ డిపోలో అంతా కల్తీ.!
- కుర్చీలకే పరిమితమైన.. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు

ఎమ్మిగనూరు పట్టణంలో వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు వెలిశాయి. అయితే ఇందులో స్వచ్ఛమైన పదార్థాలు మచ్చుకైనా కనిపించడం లేదు. చాలా వరకు నిల్వ చేసిన పదార్థాలు విక్రయిస్తున్నట్లు విమర్శలున్నాయి. రోడ్డు పక్కన ఉన్న చిన్న చిన్న హోటళ్ల నుండి రెస్టారెంట్ల వరకు వంట పదార్థాలకు కల్తీ నూనె వాడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా మాంసాహారాల్లో కల్తీ ఎక్కువగా జరుగుతున్నట్లు భోజన ప్రియులు తెలుపుతున్నారు. ఫ్రీడ్జిల్లో మూడు నాలుగు రోజులు నిల్వ ఉంచిన మాంసాన్ని వాడుతున్నారు. ఈ విషయం తెలియక భోజన ప్రియులు లొట్టలేసుకంటూ తింటున్న ప్రజల ఆరోగ్యంపై పెద్దఎత్తున ప్రభావం చూపుతున్నాయి.

ఎమ్మిగనూరు క్రైం,ప్రభాతవార్త:

- లోపించిన పారిశుధ్యం.. హోటళ్లు, రెస్టారెంట్లలోని వంటశాలలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. అధికారులు అడపాదడపా తనిఖీలు నిర్వహించి మిన్నకుండిపోతున్నారు. పట్టణంలో మునిసిపాలిటి అదికారులు కూడ హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, చిన్న చిన్న హోటళ్లపై తనిఖీలు నిర్వహించకపోవడంతో నాణ్యత లేని ఆహార పదార్థాలను ప్రజలకు అంటగడుతున్నారు. ఎమ్మిగనూరులో 20కి పైగా రెస్టారెంట్లు, వందకు పైగా హోటళ్లు, 200కు పైగా చిన్న చిన్న హోటళ్లు, విధి విధికి పాస్ట్ ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితిని బట్టి పేద, మధ్య తరగతి ప్రజలు ఫుట్‌పాత్ ఆహార పదార్థాలకే ఆకర్షితులవుతున్నారు. ఇక్కడ ఏ రోజుకారోజు కాకుండా ముందు రోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను నిల్వ ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నారు. ఇక పెద్ద పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాల విషయానిక వస్తే వారాల తరబడి చికెన్, మటన్ నిల్వ చేసి విక్రయాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

• వివరాలు 2లో

సిఐడి అడిషనల్ డిజీపిని కలిసిన ఎస్పీ...

కర్నూలు క్రైమ్,ఏప్రిల్,24,ప్రభాతవార్త :

సిఐడి అడిషనల్ డిజిపి ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు సిఐడి రీజనల్ ప్రాంతీయ కార్యాలయంలో పరిశీల సందర్భంగా బి క్యాంప్‌లోని పోలీస్ అతిథిగృహం చేరుకున్న సిఐడి విభాగ అధిపతి అడిషనల్ డిజీపీ ఎన్ సంజయ్ ను కలిసినట్లు తెలిపారు.

రాయలసీమ కోసం డూ ఆర్ డై..!

(మొదటి పేజీ తరువాయి) : ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సభ సాయంత్రం 6 గంటల వరకు సాగింది. రాయలసీమ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులతో పాటు తెలంగాణకు చెందిన గద్దర్, మందకృష్ణ మాదిగ తదితరులు కర్తవదీక్ష కార్యక్రమంలో పాల్గొని సీమ అభివృద్ధికి చేయి కలుపుతామని హామీ ఇచ్చారు. రాయలసీమ నలుమూలల నుంచి హాజరైన భారీ జన సందొహంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. నాయకులు జెసి దివాకర్ రెడ్డి, శైలజనాథ్, గంగుల ప్రతాపరెడ్డి, గద్దర్, మందకృష్ణ మాదిగ తదితరులు ప్రసంగించారు, ఇందులో స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి సీమ అభివృద్ధి కోసం త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామన్నారు. అయితే మాజీ మంత్రి జెసి దివాకర్ రెడ్డి రాయల తెలంగాణకు మద్దతుగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మరో నేత గంగుల ప్రతాపరెడ్డి గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం కావాలంటూ నినదించారు. కాంగ్రెస్ పార్టీ నేత శైలజానాథ్ భూమి నిష్పత్తి ప్రకారం నీళ్లు ఇచ్చి సీమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వారి వారి కోణంలో రాయలసీమ అభివృద్ధికి కావలసిన కార్యాచరణను వివరించారు.

స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ చాలా కాలంగా వెనుకబాటుతనంతో అల్లాడిపోతుందన్నారు ఎంతమంది నాయకులు వచ్చిన సీమకు న్యాయం జరగలేదన్నారు. సీమ అభివృద్ధిపై ప్రధాని మోడీకి ఎన్నో లేఖలు రాశాను అన్నారు. ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. కర్ణాటక తరహాలో రాయలసీమను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలో నిర్మించనున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు చాలా అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. అదే క్రమంలో తీగల వంతెన కాక నీటి ప్రాజెక్టు కావాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మిస్తే సీమవాసుల చీకటి బ్రతుకుల్లో వెలుగు నిండుతుంది అన్నారు. రాయల తెలంగాణను ఖండిస్తున్నానని ఆయన కర్తవ్య దీక్ష స్టేజిపై ప్రకటించడం నాయకుల మధ్య సఖ్యతను ఎత్తి చూపించింది. రాయలసీమ గడ్డను విడదీసే దమ్ము ధైర్యం ఎవరికీ లేదని మళ్లీ జన్మంటూ ఉంటే రాయలసీమలోని పుట్టాలని కోరుకుంటానని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రాయలసీమకు నీళ్లు లేవు నిధులు లేవు అభివృద్ధి లేవని అన్నారు. తెలంగాణ కంటే కోటి రెట్లు దరిద్రంలో సీమ ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో తాగే నీరు లేదన్నారు. రాయలసీమకు ప్రాజెక్టులు వస్తే కాలువలు చెరువులు కళకళలాడంతో సీమశాస్యశ్యామల అవుతుందని ఆయన అన్నారు. ఏది ఏమైనా సీమ అభివృద్ధి కోసం త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని ఆయన ప్రకటించారు.

మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి రాయల తెలంగాణ అంశంను మరోసారి తెరపైకి తెచ్చారు. కర్తవ్యదీక్షలో ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. రాయలసీమను తెలంగాణలో కలపాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడే రాయలసీమ నీటి సమస్య తీరుతుందన్నారు. రాష్ట్రాలు విడగొట్టడం సులువు కానీ కలపడం చాల కష్టం అన్నారు. రాయలసీమను కలుపుకోవాల్సిన అవసరం కేసీఆర్‌కు ఉందన్నారు. రాయల తెలంగాణ కావడానికి ఎవరికీ అభ్యంతరం లేదని, నాయకులందరినీ సమీకరిస్తున్నానన్నారు. ఎన్నికల తర్వాత నేతలందరినీ కలుస్తానని చెప్పారు. కాగా రాష్ట్ర విభజనకు ముందు రాయల తెలంగాణ అంశం విస్తృతంగా తెరపైకి వచ్చింది. నాడు ప్రత్యేక రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడమా? హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడమా? లేక రాయల సీమలోని జిల్లాలను తెలంగాణలో కలిపి రాయల తెలంగాణగా ఏర్పాటు చేయడమా? అనే అంశంపై చర్చ జరిగింది. అనేక చర్చలు సంప్రదింపుల అనంతరం తెలంగాణ ప్రాంతాన్ని తెలంగాణగా, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలను కలిపి ఆంధ్రప్రదేశ్‌గా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. ఈ ప్రక్రియ ముగిసిన తొమ్మిదేళ్ల తర్వాత త్వరలో ఎన్నికలు జరగాల్సిన వేళ రాయలసీమను తెలంగాణలో కలపాలని జేసీ దివాకర్ రెడ్డి డిమాండ్ చేయడం సంచలనంగా మారింది. మరోవైపు, రాయలసీమ కర్తవ్య దీక్షలో పాల్గొన్న మాజీ ఎంపీ గంగుల ప్రతాప్ రెడ్డి.. గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం కావాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో కలిపి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని అన్నారు. గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం వస్తే నిధులు, నియామకాలు వస్తాయని చెప్పారు. రాయలసీమలో కష్టపడి కాలువలు సాధించామని.. కానీ, కెనాల్స్ లో పారాల్సిన నీటి పరిస్థితి ఎంటి ? అని నిలదీశారు. రాయలసీమకు ఇప్పటి వరకు సరైన నికర జలాల పంపిణీ జరగలేదని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ మీద ఆరు జిల్లాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. అందులో గ్రేటర్ రాయలసీమకు విభజన ఆంధ్రప్రదేశ్ 512 టీఎంసీలు కేటాయించగా, అందులో దామాషా ప్రకారం సీమకు 300 టీఎంసీలు కేటాయించాలని అన్నారు. పార్టీలకు అతీతంగా సీమలోని నేతలందరూ ఏకం కావలసిన అవసరం వచ్చిందని చెప్పారు.

సిద్ధేశ్వరం బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి కేంద్ర ప్రబుత్వం సిద్ధంగా ఉన్నా తెలుగు రాష్ట్ర ప్రబుత్వాలు మాత్రం పట్టించుకోవట్లేదని అన్నారు. రాయలసీమ హక్కులు సాధించుకోవాలంటే ప్రత్యేక రాష్ట్రం ఒకటే మార్గమని చెప్పారు. దేశంలో 30వ రాష్ట్రంగా రాయలసీమను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 98 వేల చదరపు కిలో మీటర్ల వైశాల్యంతో దేశంలో 12వ రాష్ట్రంగా గ్రేటర్ రాయలసీమ ఉండాలని చెప్పారు.

జనాభా పరంగా 2 కోట్ల 15 లక్షల మందితో దేశంలో 17వ రాష్ట్రంగా గ్రేటర్ రాయలసీమ నిలుస్తుందన్నారు. సీమకు నీళ్లు ఇస్తే బంగారం పండించి దేశానికి అన్న సీమగా రాయలసీమ మారుతుందని చెప్పుకొచ్చారు. ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు పుట్టినిల్లు రాయలసీమ అని తెలిపారు. సీమ విడిపోయి ప్రత్యేక రాష్ట్రం వైపు అడుగులు వేస్తేనే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

తరాలుగా సీమకు అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి శైలజానాథ్ అన్నారు. రాయలసీమకు అన్యాయం జరుగుతుంది సిఎంలు మనవాళ్ళే అన్న పేరుతో తప్ప ఉయయోగం లేదన్నారు. ఒకప్రణాళిక రూపొందిస్తే మా వంతు పనిచేస్తాం భూమి నిష్పత్తి ప్రకారం నీళ్లు ఇవ్వాలి కానీ అలా జరగడం లేదు.నీళ్లు, నిధులు, కావాలి. శ్రీశైలంలో మొత్తం నీరు మాకే ఇవ్వొచ్చు కదా..? రాజకీయాలకు అతీతంగా మాట్లాడుతునే ఉంటాం, అన్ని రాజకీయ పక్షాలు ఒక తాటిపైకి రావాలి... బ్యారెజ్ డ్యాం నిర్మించాలి... గుండ్రేవుల సిద్దేశ్వరం కేవలం మాటలకే పరిమితం అయిందన్నారు. జగన్‌కి రాయలసీమ గుర్తుకు వస్తుందా... కనీసం అప్పర్ భద్ర పూర్తయితే రాయలసీమ ఎడారే అన్న విషయం తెలుసా అని ప్రశ్నించారు. మీరు అమరావతిలో కుర్చోని బటన్ నొక్కొతే అప్పర్ భద్ర ఆగిపోదన్నారు. ప్రబుత్వం అప్పర్ భద్రపైన న్యాయస్థానం ఆశ్రయించాలని డిమాండ్ చేశారు.

పట్టా భూములు.. ప్రొహిబిషన్ జాబితా(22ఏసి)లోకి..!

(మొదటి పేజీ తరువాయి) : సహా కార్యాలయ రికార్డులను బట్టి ఆయా మండల తహశీల్దార్లు ఇప్పటికే కలెక్టర్ రాతపూర్వకంగా నివేధించారు. ఇలా నిషేధిత జాబితాపై వచ్చిన ఫిర్యాదులను డిఆర్ఓ కూడా పరిశీలించి రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. ఈ ప్రొహిబిషన్ జాబితా రిపోర్టులు అన్నీ సి సెక్షన్ ద్వారా కలెక్టర్ ఫేషీ వద్దకు చేరాయి. భాదితులు అడిగిన ప్రతిసారి తమ చేతుల్లో ఏమి లేదని ఫైల్స్ కలెక్టర్ వద్దకు చేర్చామని విషయం తేల్చాల్సింది కలెక్టర్ అని సి సెక్షన్ వారు చెబుతున్నారు. మొన్నటి వరకు ఉన్న కలెక్టర్ ఈ ప్రొహిబిషన్ జాబితా క్లియర్ చేస్తానని చెప్పాడని అయితే ఇంతలో ఆయన బదిలీపై వెళ్లిపోవడం జరిగిందని ఇక ప్రస్తుత కలెక్టర్ ఈ జాబితా పరిశీలించాల్సి ఉందని అంటున్నారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని కాబట్టి కొత్త కలెక్టర్ ఈ జాబితాను పరిశీలించి హక్కుదారులైన పట్టాదారులకు న్యాయం చేయాలని భాదితులు కోరుతున్నారు.

కల్తీ మాయ..

– నూనెలోనూ కల్తీ మయం..: **(మొదటి పేజీ తరువాయి) :** ఎమ్మిగనూరు పట్టణంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన హోటళ్లలో, రెస్టారెంట్లలో, డాబాల్లో కల్తీ నూనెలను వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కల్తీ నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు తిన్న ప్రజలు అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నాన్ వెజ్ హోటళ్లలో ఇష్టానుసారంగా కల్తీ నూనెలను వాడుతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో నూనె తయారి కేంద్రాలు పుట్టుగొడుగుల్లా వెలిశాయి. అయితే ఈ నూనె తయారి కేంద్రాల్లో కూడ నాణ్యత పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పెరిగిన ధరలకు పెద్ద పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, పాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వహకులు తక్కువ ధరకు లభించే కల్తీ నూనెను వినియోగిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కల్తీకి అడ్డుకట్ట వేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు తమ కార్యాలయాల్లో కుర్చీలకే పరిమితమైయ్యారే తప్ప తనిఖీలు నిర్వహించడం లేదని భోజన ప్రియులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న కల్తీ ఆహార పదార్థాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

– అయిల్ డిపోలో అంతా కల్తీ.!

ఎమ్మిగనూరు పట్టణ శివారు కలుగొట్ల రోడ్డు నందు ఉన్న ఓ అయిల్ డిపోలో కల్తీ నూనె తయారు అవుతున్నట్లు సమాచారం. దూర ప్రాంతాల నుంచి బ్రాండ్ నూనె ను అయిల్ ట్యాంక్‌ల ద్వార తీసుకువచ్చి అయిల్ డిపో నందు కల్తీ అయిల్ కలిపి స్వంతంగా అయిల్ డబ్బాలను తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలల క్రితం అయిల్ ధరలు పెంచి ఇష్టారాజ్యంగా నూనె విక్రయాలు చేస్తున్న సమయంలో జిల్లా విజిలెన్స్ అధికారులు నూనె దుకాణాలపై తనిఖీలు నిర్వహించేందుకు వస్తే విషయం తెలుసుకున్న అయిల్ డిపో నిర్వహకుడు దుకాణంకు తాళం వేసి పరారైనట్లు సమాచారం. దీంతో కొద్ది రోజుల అనంతరం తన కల్తీ నూనె తయారి వ్యాపారం యధావిధిగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలకు, చికెన్ ఫ్రై దుకాణాలకు ఈ అయిల్ దుకాణ నిర్వహకుడు మార్కెట్ ధర కంటే అతి తక్కువ ధరకు నూనె ను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అధికారులు తనిఖీ నిమిత్తం వచ్చినప్పుడు అయిల్ డిపోకు తాళం వేయడం..అధికారులు వెళ్లిన తరువాత డిపో తెరుచుకొని తన కల్తీ వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలు అన్నచందంగా సాగుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాల్లో వంటకాలకు నిర్వహిస్తున్న కల్తీ నూనె ను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన భాద్యత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

90 శాతం ఫిర్యాదులు సచివాలయాల్లో పరిష్కారం కావాలి

(మొదటి పేజీ తరువాయి) : వివరాలు జిల్లా కేంద్రానికి పంపడంతో పాటు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈవిషయంపై గతంలో కూడ చెప్పడం జరిగిందని ఇందుకు సంబంధించిన సర్కులర్ అధికారులకు జారీచేయాలని ఇంచార్జీ డిఆర్వోకు కలెక్టరు అదేశించారు. అలాగే స్పందన సమస్యల నాణ్యత పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అదేశాలు వచ్చాయని స్పందన గ్రీవెన్స్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రజలు సంతృప్తి చెందేస్థాయిలో స్పందన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్జీదారులకు ఎండార్స్‌మెంట్ కానీ స్పీకింగ్ ఆర్డర్స్ గానీ ఫిర్యాదు దారునికి ఖచ్చితంగా చేరేలా ఉండాలన్నారు. సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ఆర్జీదారులను నుంచి దరఖాస్తులు స్వీకరించేలా ఎంపిడిఓలు దృష్టిసారించాలన్నారు. జిల్లా కేంద్రానికి అధిక ఫిర్యాదులు వస్తున్నాయంటే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని స్పష్టం అవుతందని, 90 శాతం ఫిర్యాదులు సచివాలయాల్లోనే పరిష్కారం కావాలని కలెక్టరు అదేశించారు. పాణ్యం మండల నివాసి లక్ష్మీదేవికి మేకల బండ జగనన్న కాలనీలో స్థలం కేటాయించారని ఇంటిమీదుగా విద్యుత్ తీగల వెళ్లడం ద్వారా బెయిల్దార్లు ఇంటి నిర్మాణం పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని మా సమస్యను పరిష్కరించాలన్నారు. నందికోట్కూరు మండలం నివాసి కె రాజు తండ్రి నడిపి శేషన్నకు 1994లో అసైన్‌మెంట్ కమిటీ అధ్వర్యంలో మద్దిగట్టు గ్రామంలో సర్వేనం.304లో 2.13 సెంట్లు, నాగటూరు గ్రామంలో సర్వేనం.758లో 1.54 సెంట్ల భూమిని కేటాయించారు. పై సర్వేనంబర్లకు సంబంధించిన రైతు కె నడిపి శేషన్న పొలంను వారసులైన నాకు కేటాయించాలని కోరారు. పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన సి సారా అనే మహిళ 30-10-2018లో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అడబిడ్డకు జన్మనిచ్చామని నా బిడ్డకు బర్త్ సర్టిఫికెట్ ఇప్పిస్తే రేషన్‌కార్డు, అమ్మఒడి, బడికి తదితర ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బనగానపల్లె మండలం రామకృష్ణాపురం నివాసి బి వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగి కుడిచేయి విరిగిందని దీనివల్ల సరిగా పనిచేసుకోలేక ఇబ్బంది పడుతున్నామని సదరం సర్టిఫికెట్‌ను మంజూరు చేయాలని కోరారు. గడివేముల మండలం గని గ్రామంలో ఎస్సీలకు స్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని దళిత జనాభాను బట్టి అర ఎకర నుంచి ఎకర స్థలం స్మశాన వాటికకు కేటాయించాలని గని గ్రామస్థులు జిల్లా కలెక్టరుకు ధరఖాస్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో 182 మంది ఆర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టరును కోరారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జారీచేశారు.

ఆటో బోల్తా....

మిడుతూరు, ఏప్రిల్24, ప్రభాతవార్త ; మండలకేంద్రమైన మిడుతూరు పరిధిలోని శ్రీ బ్రహ్మంగారి మఠం వద్ద సోమవారం ఉదయం ఆటో బోల్తాపడగా, డ్రైవర్‌కు గాయాలై త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. పాలు, పెరుగు ఇతర సరుకులతో మిడుతూరులోకి ప్రవేశిస్తున్న ఆటోకు కుక్క అడ్డు రావడంతో దానిన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పాలు, పెరుగు, ఇతర సరుకులు నేలపాలయ్యాయి.

తండంచలో మొక్కజొన్న బస్తాలు చోరీ

జూపాడుబంగ్లా, ఏప్రిల్ ,24 ప్రభాతవార్త : జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన బోయ మద్దిలేటికి చెందిన మొక్క బస్తాలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాదిత రైతు తెలిపారు. గ్రామ సమీపంలోని శేఖరరెడ్డి పొలంలోని చింతచెట్ల కింద కాటవేసి ఉంచిన 23 ప్యాకెట్ల మొక్కజొన్నలు అపహరణకు గురైయాన్నారు. మొక్క జొన్న బస్తాలు కనపడకుండా ట్రాక్టర్ అడ్డుపెట్టిన దుండగులు 23 ప్యాకెట్లను ఆటోలో తీసుకెళ్లినట్లు అనావాళ్లు ఉన్నాయన్నారు. అదే గ్రామంలో గత గురువారం మేదరి వెంకటేశ్వర్లకు చెందిన వేరుశెనగ బస్తాలు అపహరణ గురైన సంఘటన మరువక ముందే మ్కొజొన్నలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైన పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాత్రిపూట పోలీసులు గస్తీపెంచి దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

అధికారులులేని గ్రామసభ

పత్తికొండ,ఏప్రిల్24,ప్రభాతవార్త: పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ నందు పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామసభ నిర్వహించారు.మేజర్ గ్రామ పంచాయతీ అయిన గ్రామసభకు అధికారులు రాకపోవడంతో గ్రామసభ తూతూ మంత్రంగా నిర్వహించారు.ఒకే నెలలో మూడుసార్లు గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగింది.మూడుసార్లు గ్రామసభ జరిగినా అధికారులు మాత్రం గ్రామసభలకు డుమ్మా కొడుతున్నారు.నియోజకవర్గ కేంద్రం,మేజర్ గ్రామ పంచాయతీ పత్తికొండ గ్రామ పంచాయతీలో అధికారుల లేకుండా గ్రామసభలు జరుగుతున్నాయి.పట్టణంలో ఉన్న సమస్యలు ఎలా తీరుతాయని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.మేజర్ పంచాయతీలో అధికారులు రాకపోవడం ఇదేమని వార్డు మెంబర్లు,గ్రామసభకు వచ్చిన ప్రజలు,సచివాలయ ఉద్యోగస్తులు,వలంటీర్లు అనుకుంటున్నారు.పట్టణంలోని ఆరు సచివాలయాల మెయింటెనెన్స్ ఖర్చులు కూడా ఎవరిని అడగాలో అర్థంకాని పరిస్థితుల్లో గ్రామసభల్లో సచివాలయ ఉద్యోగస్తులు, వలంటీర్లు,గ్రామానికి సంబంధించిన ప్రజలు చర్చించుకుంటున్నారు.సచివాలయ సిబ్బందికి ఏ పనిచేయాలో ఏమి నియమ నిబంధనలు ఉన్నాయో అర్థంకాని పరిస్థితుల్లో గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు వచ్చారు వెళ్లిపోయారు ఏమి వర్క్ చేశామో వారికే అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నారు.మేజర్ పంచాయతీ అయినప్పటికి 29వేల జనాభాకు ఏమి సమాధానం చెబుతున్నారో అర్థంకాని గ్రామసభలు జరుపుతున్నరన్నారు.దీనికి సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అనాద బాలబాలికలకు దుప్పట్లు పంపిణీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 24,ప్రభాతవార్త : కోవెలకుంట్ల పట్టణంలోనపి హరిబాలట్రస్టులోని బాలబాలికలకు రాంకో సిమెంటు యాజామాణ్యం 45 దుప్పట్లను పంపిణీ చేసింది. వివరాల్లోకి వెల్లితే కొలిమిగుండ్ల మండలంలోని నూతనంగా ఏర్పాటైన రాంకో సిమెంటు ప్యాక్టరీ ప్రసిడెంట్ రెడ్డినాగరాజు, సీనియర్ మేనేజరు శోభన్ బాబులు సోమవారము కోవెలకుంట్లపట్టణంలోని హరి బాల ట్రస్టులో ఉన్న వారికి ఈ దుప్పట్లను అందించారు ఈసందర్భముగా వారు మాట్లాడుతూ మా రాంకో సిమెంటు ప్యాక్టరీల ఫౌండరు రామస్వామి 129వ జయంతిని పురస్కరించుకుని పేదలకు సహాయం చేయాలనే తలంపుతో ఈ వితరణ కార్యక్రమం చేపట్టామని చెప్పారు.

జగనన్నే మా భవిష్యత్తు ప్రజల మనస్సులో నిలిచిపోతుంది

– మూడవ స్థానంలో బనగానపల్లె నియోజకవర్గం రావడం గర్వించదగ్గ విషయం

అవుకు,ఏప్రిల్24,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి బనగానపల్లె నియోజకవర్గం మూడవ స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయమని అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి తెలిపారు.జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఈ కార్యక్రమం ప్రజల మనస్సులో నిలిచిపోతుందని ఆమె తెలియజేశారు.జగనన్న రథసారథులు ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ పాలన పై అభిప్రాయాలు సేకరించడంతోపాటు టీడీపీ ప్రభుత్వం,వైసీపీ ప్రభుత్వం మధ్య తేడాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని మ్యానిఫేస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చామని వివరిస్తూ ఈ కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల మంది కార్యకర్తలు,గృహసారథులు ప్రజలను కలిసి వారి అభిప్రాయాలు సేకరించడం జరుగుతుందని తెలియజేశారు.గృహసారథులు ప్రతి 50 నుండి 100ఇళ్లకు ఇద్దరు చొప్పున వెళ్లి జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని వివరిస్తున్నారని ఈ కార్యక్రమంలో మొత్తం 7లక్షల మంది పాల్గొంటున్నారని తెలియజేశారు.దేశ చరిత్రలోనే జగనన్నే మా భవిష్యత్తు లాంటి కార్యక్రమం ఎక్కడా జరగలేదని అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి అన్నారు.ప్రతి ఇంటికి వెళ్లి జగన్ పాలనలో ప్రజలకు జరుగుతున్న మేలును గురించి అమలు చేస్తున్న పథకాల గురించి వివరిస్తున్నారని ఆమె తెలియజేశారు. రాజకీయాలకు,పార్టీలకు,కులాలకు,మతాలకు అతీతంగా అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వారు ఎంత లబ్ది పొందుతున్నారు వారికి వివరంగా వివరించడం జరుగుతుందని తెలియజేశారు.మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని గెలిపించుకుంటామని ఆమె తెలియజేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం – చల్లా విఘ్నేశ్వరరెడ్డి

అవుకు,ఏప్రిల్24,ప్రభాతవార్త: అవుకు మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చల్లా విఘ్నేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన వర్షాలకు దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించి వెంటనే సంబంధిత అగ్రికల్చర్ అధికారులతో చర్చించి నష్టపోయిన రైతులందరికి నష్టపరిహారాన్ని అందేలా చేసి వారికి సరైన న్యాయం చేయాలని అధికారులకు తెలియజేశారు.అవుకు మండలంలో రబీ సీజన్‌కు 2212 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు.అయితే గత కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంట నెలకొరిగి రైతులు అపార నష్టాన్ని చవిచూశారు.అవుకు మండలంలో వివిధ గ్రామాలలో కల్లాల్లో ఆరబెట్టిన మిరప వర్షానికి తడిసిపోవడంతో రైతులకు అపార పంటనష్టం జరగడంతో ఈ విషయాన్ని వైసీపీ యువనాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని బిందెలతో నిరసన

సిబెళగల్,ఏప్రిల్24,ప్రభాతవార్త: మండల కేంద్రమైన సిబెళగల్‌లో రెండవ వార్డు పరిధిలోని ప్రజలు మాకు తాగునీటి సమస్య తీర్చండంటూ సోమవారం ఖాళీ బిందెలతో మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ సర్పంచ్‌ను వెంటనే పిలిపించి తాగునీటి సమస్యను వారం రోజుల్లో తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.ముఖ్యంగా గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో కొన్ని పనులు సర్పంచ్‌లు చేయలేకపోతున్నారని ఆయన వారికి వివరించారు.ఈ సమస్య పరిష్కారాన్ని వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఏ.సి.రాముడు,సర్పంచ్ ఎం.డి.పాండురంగన్న,ఈవోఆర్‌డీ సందీప్,పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

28న వాహనాల బహిరంగ వేలం

కోవెలకుంట్ల,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : అక్రమ నాటుసారా, అక్రమమద్యం కేసుల్లో పట్టుబడ్డిన వాహనాలను ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డియస్‌పిసుదాకరరెడ్డి చెప్పారు. ఈవేలం అళ్లగడ్డ రూరల్ పోలీసు స్టేషన్ నందు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 40వాహనాలను వేలం వేస్తున్నామని వాటిలో 33ద్విచక్రవాహనాలు మూడు అటోలు, 4పోరన్ వీలర్లు ఉన్నాయని చెప్పారు.వేలంలో పాల్గొన్న వారు వేలం ముగిసిన వెంటనే జియస్‌టితో కలిపి సొమ్మును చెల్లించివాహనాలను స్వాదానము చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

కౌతాళం, ఏప్రిల్24, ప్రభాతవార్త ; మండలకేంద్రమైన కౌతాళంలోని సచివాలయం-01లో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు సమక్షంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు, మంచినీటి సరఫరా సిబ్బందికి, వీధిలైట్లు నిర్వహణ నిర్వహించే సిబ్బంది సేవలను గుర్తించి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీ కార్మికుల సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య, వడ్డే రామన్న, ఎంపీపీ బుజ్జిస్వామి, చౌదరి బసవ, మాజీ సర్పంచ్ అవతారం, ఉమాపతి, శ్రీశైలం, వార్డుమెంబర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన

**హాలహర్వి,ఏప్రిల్ 24,

అతివేగం ప్రమాదకరం

మహానంది, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః అతివేగం ప్రమాదకరమని మహానంది ఎస్ ఐ నాగేంద్ర ప్రసాద్ ఆటో డ్రైవర్లకు సూచించారు. సోమవారం మహానందిలోని స్థానిక పోలీస్‌స్టేషన్ నందు ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని లౌడ్ స్పీకర్లు తీసివేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా వాహనాలు నడపాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని పలు సూచనలు, సలహాలు చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణి ప్రారంభం

కర్నూలు విద్య, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2023-24కు సంబంధించిన పాఠ్యపుస్తకాల పంపిణి ప్రారంభించినట్లు డిఇఓ తెలిపారు. సోమవారం మండలంలో ఎంపిక చేసిన నిల్వ కేంద్రాలకు పంపుతున్నట్లు డిఇఓ తెలిపారు. మండల కేంద్రంలో వుండే కమిటీ వీటిని రిసివ్ చేసుకొని జాగ్రత్త పరచాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసి బస్సుల్లో ఈ పుస్తకాలను పంపుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు కర్నూలు గోడౌన్ ద్వారానే పంపిస్తున్నట్లు తెలిపారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా పాఠ్యపుస్తకాలను రిసివ్ చేసుకున్న వెంటనే యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. 2023-24 సంవత్సరానికి మొత్తం 51,72,021 పుస్తకాలు అవసరం కాగ మొదటి స్పెల్‌లో 15,22,630 పుస్తకాలు వచ్చాయని వాటిని వెంటనే మండల స్టాక్ పాయింట్లకు పంపిస్తున్నామని మండలస్థాయి కమిటీ రిసివ్‌చేసుకొని భద్రపరచాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీసి మేనేజర్, టెక్స్ బుక్స్ మేనేజర్ భారతీదేవి, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

ఎగువ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఏడారే

శిరివెళ్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః కర్నాటకలో ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ ప్రాంతం ఏడారిపాలవుతుందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోవిందపల్లె పొలమేరలో గల సింధు వేర్ హౌస్ వద్ద ఆళ్లగడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సి పుల్లయ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ బచావత్ ట్రీబ్యునల్ అవార్డు ప్రకారం ఏపీ రావాల్సిన నీటివాట సక్రమంగా రావడం లేదని ఎగువ భద్ర నిర్మించడం వల్ల మరింత అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎగువ భద్ర ప్రాజెక్టుకు నికర జలాల కేటాయింపు లేనప్పటికి మోధీ ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడం సరికాదని ఘాటుగా విమర్శించారు. ప్రధాని నరేంద్రమోధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిలు రాయలసీమ ప్రాంతానికి రాహుకేతువులుగా మారారని ఆయన ధ్వజమెత్తారు. గండ్రేవుల రిజర్వాయర్‌ను ప్రాజెక్టుగా గుర్తించి నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆళ్లగడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ పుల్లయ్య మాట్లాడుతూ గం డ్రేవుల రిజర్వాయర్‌ను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించకపోతే జగన్ రాయలసీమ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు సింకిదర్ భట్, శిరివెళ్ల మండల అధ్యక్షులు నరసింహులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

భూమా శోభానాగిరెడ్డికి ఘన నివాళి

శిరివెళ్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాయకురాలు, ఆళ్లగడ్డ మాజీ శాసన సభ్యురాలు, రాయలసీమ రాజకీయాల్లో పోటీలేని అడపడచు భూమా శోభానాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా శిరివెళ్ల మండల మాజీ ఎంపిపి శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డిల అధ్వర్యంలో భూమా శోభా నాగిరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శోభమ్మ పట్ల ప్రజల అభిమానం గురించి వేరే చెప్పనక్కర్లలేదని అందుకు ప్రజలు పలు ప్రాంతాల నుంచి ఆమెకు నివాళ్లు అర్పించారు. కొన్ని కోట్ల మంది ప్రజల అభిమానం చూరగొని ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం అహోర్నిశలు కృషిచేసేవారని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుంది

కర్నూలు విద్య, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః మధ్యాత్మ ఆరాధనలతో ధర్మముల స్థాపన జరుగుతుందని అదే త్రైంత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని కల్లూరు మండలంలోని దూపాడు గ్రామం నందు త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞానవేధికకు చెందిన కల్లూరు కమిటీ వారి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, సాంధ్ర సింధు వేదం సారాంశ గ్రంధాలను ప్రచారం చేయడం జరిగింది. సాంధ్ర సింధు వేదం పారాంశదాత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంధాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుంది. అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ ఆధ్యాయంలో 16,17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి అధారమని తెలిపారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ద్వారా సమాజంలో ఉన్న కుల మతాలను రూపుమాపడానికి ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పురుషోత్తం,నాగభూషణం, మద్దిలేటి, సుంకన్న, వెంకటేశ్వర్లు, అనిల్,ఈశ్వరయ్య,ఓబులేసు, శివ,లత, వరలక్ష్మి, మౌనిక, అవినాష్, అక్షిత్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయితీలకు పురస్కారాలు

వెలుగోడు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: మండల కార్యాలయంలో ఎం.పి.పి.లాలం రమేష్ అధ్యక్షతన జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ. షేఖ అమానుల్లా మాట్లాడుతు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా తొమ్మిది థీమ్స్ గురించి వివరించారు. అనంతరం తొమ్మిది థీమ్స్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయితీలకు మండల స్తాయి ఉత్తమ పంచాయితీ పురస్కారాలు అందజేశారు. జడ్పీటిసి కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్‌సులేమాన్, ఈఓఆర్డీ వెంకటరెడ్డి, సర్పంచులు మరియు కార్యదర్శిలు పాల్గొన్నారు.

బేడబుడగ జంగాల స్మశాన వాటికకు పట్టా ఇవ్వాలి

నందికొట్కూరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: పట్టణంలో దాదాపు 40 ఏళ్ళుగా మా కుటుంబాలలో చనిపోయిన వారిని కొండయ్యచేను ప్రక్క కుంటలో స్మశాన వాటికగా అందులో అంత్య క్రియలు నిర్వహిస్తున్నామని కాని ప్రస్తుతం కొంత మంది ఆక్రమించారని వెంటనే మాకు న్యాయం చేయాలని బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసిల్దార్ రాజశేఖర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు బేడ బుడగ జంగాలీలు దాదాపు 500 కుటుంబాలు ఉన్నాయని, సర్వే నెం. 176/ బిలో ఉన్న రెండు ఎకరాల స్మశాన వాటికను మాలలు, మాదిగలు ఆక్రమించుకొన్నారని కావున వెంటను స్వాధీనం చేసుకొని మాకు పట్టా ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరివాటి అలేక్యం,జమ్మన్న, డి.శ్రీనివాసులు, చంద్రశేఖర్,కొండలయ్య,రమేష్, ఎల్లప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని సాగనంపుదాం సిపియం పిలుపు

వెలుగోడు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అధికారం చేపట్టగానే రెండు లక్షల ఉద్యోగవకాశాలు కల్పిస్తామని, ధరలు తగ్గిస్తామని అబద్దాలు చెప్పి అధికారం చేపట్టాక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపిని సాగనంపుదామని సి.పి.యం.పార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం పొట్టి శ్రీరాములు సెంటర్ నుండి ప్రధాన కూడలీలలో పాదయాత్ర చేస్తు కరపత్రాలను పంపిణి చేస్తూ ఆర్టీసీ బస్టాండు వద్ద ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు నాగమోహన్, అవాజ్ కమిటీ జిల్లా నాయకులు మహమ్మద్‌రఫీ మాట్లాడుతు అన్ని ధరలు తగ్గిస్తామని డా.బి.ఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేస్తామని, అధికారం చేపట్టగానే ధరలు పెంచారని, మతోన్మాధాన్ని పోషిస్తూ ప్రభుత్వ పరిశ్రమలన్నింటిని కార్పోరేట్ శక్తులకు ధారదత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాని ఇంటికి పంపాలని అందరు ఐక్యంగా బిజెపిని ఎదుర్కోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, ఎర్రభాష, పక్కీరయ్య, మహ్మద్, లింగన్న, ఖాదర్‌వలి, రామక్రిష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ అనుకూల మోడీని గద్దె దింపుదాం

పత్తికొండ,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : కార్పొరేట్ అనుకూల మోడీని గద్దె దింపుదామని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పి భీమలింగప్ప,సిపిఐ మండల కార్యదర్శి డి రాజాసాహెబ్,సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో వామపక్ష నాయకులు ప్రచార భేరి బహిరంగ సభకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద మోడీని సాగనంపుదాం కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను ఓడిద్దామన్నారు. మన రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదని,ఏపికి ప్రత్యేక హోదా,విభజన హామీలు ఇవ్వకుండ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు పూనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నెల 26న పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ,కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య,జిల్లా కార్యదర్శి గిడ్డయ్య,సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌లు హాజరవుతారన్నారు. ఈ సభను విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరి,సిపిఐ,ప్రజా సంఘాల నాయకులు రంగన్న,మాదన్న, సుంకన్న,నరసింహులు,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీనియస్ గ్లోబల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెసిడేన్షియల్ హాస్టల్ పేరుతో విధ్యార్థుల నుండి అక్రమంగా వేలకు వేల రూపాయలు వసూలు చేస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఏవిఎఫ్ డివిజన్ అధ్యక్షులు మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశిల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నవోదయ,గురుకుల కోచింగ్ ఇస్తామంటూ విధ్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నట్లు ఆరోపించారు. అదేవిధంగా ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియక ముందే అక్రమంగా అడ్మిషన్లు చేస్తూ అక్రమంగా సంపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి విద్యాశాఖాధికారులు స్పందించి ప్రభుత్వనిబంధనలు అతిక్రమిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కల్వర్లు పనులు ప్రారంభం

మద్దికెర,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : మండల కేంద్రమైన మద్దికెరలో ఊరు వాకిలి దగ్గర ఎన్నో సంవత్సరాల తరబడి కల్వర్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రయాణించడంతో పాటు వాహనదారులకు ఎంతో ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యను గుర్తించి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి వీరి సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేయడం జరిగింది. సర్పంచ్ బండారు సుహాసిని పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు ఊరు వాకిలి నుండి వచ్చే మురుగునీరుకు ప్రత్యేక కాలువలు ఏర్పాటు చేసి తదనంతరం కల్వర్లు పనులను సోమవారం నుండి ప్రారంభించి గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నారు.

బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్‌కు ఘన సన్మానం

ఆదోని,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జడ్ఏకె రాజాసాహెబ్ తెలంగాణ రాష్ట్రానికి బదిలీ అయ్యాడు. తెలంగాణ రాష్ట్రానికి బదిలీ అయిన హెడ్‌కానిస్టేబుల్ జడ్ఏకె రాజాశేఖర్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారులు,సిబ్బంది శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

మోడీని గద్దె దింపండి-దేశాన్ని కాపాడండి

దేవనకొండ,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న మోడి ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని సిపిఐ,సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె మద్దిలేటిశెట్టి,బి వీరశేఖర్‌లు అన్నారు. సిపిఐ,సిపిఎం ఆద్వర్యంలో సోమవారం మండల పరిధిలోని నల్లచెలిమిల,గుడిమిరాళ్ల గ్రామాల్లో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం,పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని,నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లచెలిమిల శాఖ కార్యదర్శి చాకలి బజారి,గుడిమిరాళ్ల శాఖ కార్యదర్శి భక్తతుకారాం, సిపిఐ,సిపిఎం మండల నాయకులు సూరి,బజారి,నరసింహులు, భూపేష్,పల్లెదొడ్డి,నాగేష్,రాజు రంగన్న,నాగరాజు,దుబ్బ నరసింహ,కిష్టన్న, లక్ష్మన్న,లక్ష్మణస్వామి,ఎర్రిస్వామి,రాజు,నాగేష్ పాల్గొన్నారు.

మృతి చెందిన విద్యార్థి నాగేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నందికొట్కూరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: జూపాడుబంగ్లా అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నాగేష్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బావిలో శవమై తేలాడని అతని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేసియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద నాయకులు రమేష్‌బాబు, దిలీప్,రంగస్వామి, మర్రిస్వామి, కుమార్, నరసింహ్మలు మాట్లాడుతు విద్యార్థుళ తల్లిదండ్రులు గురుకలం పాఠశాలలో చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశతో పిల్లలను ఇక్కడి చేర్పిస్తారని కానిఇ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు బలి అవుతున్నారని, ఈ నెల 22వ తేదీ విద్యార్థి అదృశ్యం అయితే కూడ అధికారులు సరైన సమయంలో స్పందించలేనందున ఒక ప్రాణం పోయిందన్నారు. గురుకుల పాఠశాలకు కాంపౌండువాల్ నిర్మాణం చేపట్టాలన్నారు. విద్యార్థి మృతికి కారకులైన వారిని వెంటనే తొగించి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహానంది, దినేష్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి : ఎస్ఐ

హొళగుంద,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎస్ఐ వి శ్రీనివాసులు అన్నారు. సోమవారం యువసేన అర్జున్ ఆద్వర్యంలో జరిగి ఎస్ఎస్‌వి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ శ్రీనివాసులు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ సునీత చేతుల మీదుగా టాస్ వేసి ఆటను ప్రారంభించడం జరిగింది. మొదటి రోజు ఎల్లార్తి మాస్ టీంతో పోటీపడిన హొళగుంద శివనాయక్ టీం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 10ఓవర్లలో 115 పరుగులు చేయగా ఎల్లార్తి మాస్ టీం లక్ష్యచేదనలో కేవలం 104పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మద్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో పెద్దహ్యాట టీంతో పోటీ పడిన నెరణికి ఎంఎస్‌డి టీం పెద్దహ్యాట టీంను ఓడించి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులును అర్జున్ యువసేన టీం పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సేవకుడు మల్లికార్జున,తిమ్మప్ప, ఆర్గనైజింగ్ టీం చిదానంద,గాదిలింగ,హుసేని,గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిభను కనబరిచిన గ్రామపంచాయతీలను గుర్తించి ప్రశంసాపత్రాలతో సత్కారం

పగిడ్యాల, ఏప్రిల్ 24,ప్రభాతార్త : పగిడ్యాల మండలంలో వివిధఅంశాలకు సంబంధించి ప్రతిభను కనబరిచిన గ్రామపంచాయతీలను గుర్తించి ప్రశంసాపత్రాలతో సత్కరించడం జరిగిందనీమండల విస్తరణాధికారి పుల్లయ్య అన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని నాలుగు గ్రామపంచాయతీలు పగిడ్యాల, పాతముచ్చుమర్రి, లక్ష్మాపురం, ఎం.గణపురం గుర్తించడం జరిగిందన్నారు. గ్రామపంచాతీలకు సంబంధించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది వాటర్ మెన్, అంగన్‌వాడీ సిబ్బందికి, ఐకెపి సిబ్బందిని శాలువాలతో సన్మానంతోపాటు ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగిందనీ మండల విస్తరణాధికారి పుల్లయ్య తెలిపారు.

సన్మానాలు కాదు..జీతాలు ఇవ్వండి..

మద్దికెర,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : పారిశుద్ధ్య కార్మికులకు సన్మానాలు అక్కర్లేదు..జీతాలు ఇవ్వాలని.. సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానిం చడం కాదు నెలల తరబడి వేతనాల కోసం నిరీక్షిస్తున్న కార్మికులను సన్మానాలతో కడుపు నింపడం సమంజసం కాదన్నారు. స్వచ్ఛభారత్ సిబ్బందికి 10 నెలల నుండి జీతాలు ఇవ్వకుండ మండలంలో ఉన్న అనేక మంది స్వచ్ఛభారత్ సిబ్బంది కడుపు కాలుస్తున్నారన్నారు. కష్టించి పనిచేసి అనుభవజ్ఞులైన పారిశుద్ధ్య కార్మికులను సన్మానించకుండ వైసిపి పార్టీలో పేరు ప్రఖ్యాత కలిగిన వ్యక్తులు సిఫారసు చేసిన వారినే సన్మానించడం సరైంది కాదన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం పారిశుద్ధ్య కార్మికులలో వర్గపోరు ఏర్పడిందన్నారు. ఐక్యంగా ఉన్న వారిని విడగొట్టడం మంచి పద్ధతి కాదని భవిష్యత్తులో ఇలాం టి పరిణామాలు చోటు చేసుకోకుండ చూసుకోవాల్సిన భాధ్యత అధికారులపై ఎంతైనా ఉందన్నారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

పగిడ్యాల, ఏప్రిల్ 24,ప్రభాతవార్త : మండల కేంద్రమైన పగిడ్యాలలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బివి.రమణ, మండల విస్తరణాధికారి పుల్లయ్య మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రజలకు చేరువచేయుటలో ప్రభుత్వం కీలపాత్రవహిస్తుందనీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామపంచాయతీ అభివృద్ధిలో కీలకభూమి అన్నారు. గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందినప్పుడే జిల్లా రాష్ట్రం, దేశం అభివృద్ధిచెందుతుందనీ మండల అభివృద్ధిఅధికారి బివి.రమణ, మండల విస్తరణాధికారి పుల్లయ్య అన్నారు. జెడ్పీటిసి పుల్యాల దివ్య మండల ఉపాధ్యక్షురాలు పల్లె అరుణమ్మ మాట్లాడుతూ దేశానికి పల్లెలే పట్టుకొమ్మలనీ మహాత్మాగాంధీ అన్నారనీ, అయన కలలుకన్నా గ్రామస్వరాజ్యం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయవలసిన బాధ్యత ఎంతైనావుందనీ జెడ్పీటిసి పుల్యాల దివ్య, మండల ఉపాధ్యక్షురాలు పల్లె అరుణమ్మ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకుని గ్రామాభివృద్ధి కోసం కృషిచేసిన వారిసేవలను గుర్తించి పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి దుశ్శాలువాలతో చిరుసత్కారం చేసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో పగిడ్యాల, లక్ష్మాపురం, పాత ముచ్చుమర్రి, గ్రామ సర్పంచ్‌లు పెరుమాల శేషన్న, శ్రీమతి సిరిగిరి సుజాత, అంజనేయులు మండల అభివృద్ధి అధికారి బివి.రమణ,మండల విస్తరణాధికారి పుల్లయ్య, మండల విధ్యాశాఖాధికారి సుభాన్,ఎపిఎం శ్రీనివాసులు, లక్ష్మాపురం పంచాయతీ కార్యదర్శి సమతయశోధర, పగిడ్యాల పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఉన్న మెలకువలు పూర్తిగా రైతుకు అందించాలి

పత్తికొండ,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయంలో ఉన్న మెలకువలు పూర్తిగా రైతుకు అందించాలని వ్యవసాయాధికారి వెంకట్రాముడు అన్నారు. సోమవారం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికల మీద సోమవారం పట్టణంలోని వెలుగు కార్యాలయం వద్ద డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వ్యవసాయాధికారి వెంకట్రాముడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం గురించి దాని ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిఒక్కరు కూడా ఘనజీవామృతం జీవామృతాలు ఉపయోగిస్తూ ప్రకృతి వ్యవసాయంలో ఉన్న మెలకువలు పూర్తిగా రైతుకు అందించాలన్నారు. అలాగే క్యాడర్ యొక్క సొంత పొలాల్లో మొదటి నుంచి మీరు చేస్తున్న పొలాల్లో దుక్కి నుంచి పంట కోత వరకు ఒక్కో నిమిషం షార్ట్ మీడియా చేస్తూ అప్‌లోడ్ చేయడం వలన ప్రతిఒక్కరు మీ దగ్గరకు వచ్చి పంటను కొనుగోలు చేస్తారని చెప్పడం జరిగిందన్నారు. ఏపిఎం సురేష్ బాబు మాట్లాడుతూ విజయ్‌కుమార్ యొక్క మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు వెళుతుందని మరియు మహిళా రైతు సంఘాలు చేయడం వలన ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం వ్యవసాయ సిబ్బందికి పోస్టర్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ రియాజ్,ఎంటి సుధాకర్,మోడల్ మేకర్స్ సురేంద్ర,రంగస్వామి,ఎల్1లు హుసేన్,లింగప్ప,ఎల్2లు హుమాయూన్ భాష,నాగరాజు,భీమరాజు, మహాలక్ష్మి,శ్రీనివాసులు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ దినోత్సవం రోజున వాలంటరీలకు వార్నింగ్

మద్దికెర,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : మండల కేంద్రమైన మద్దికెరలో సోమవారం స్థానిక కమిటీ హాల్ నందు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి,ఎంపిపి అనిత యాదవ్,సర్పంచ్ బండారు సుహాసినిలు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా దేశంలో ఎక్కడా లేని వాలంటరీ వ్యవస్థను రూపొందించారన్నారు. మహాత్మ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ద్వారానే నిజమైన స్వాతంత్ర్యం రాగలదని గ్రహించి సచివాలయ వ్యవస్థను, వాలంటరీ వ్యవస్థను రూపొందించడం జరిగిందన్నారు. మండలంలో అనేక మంది వాలంటరీలు అన్యాయాలు,అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇకనుండి ఇలా జరిగితే ఇలాంటి వారిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు బనాయించి శిక్ష పడేలా చేస్తామన్నారు. వాలంటరీలు పరీక్షల ద్వారా ఎంపికైన వారు కాదు మా సిఫారసుల మేరకు మీరు ఎంపికైన వారు ప్రభుత్వానికి మచ్చ తెస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీ కార్యదర్శులుగా ఎంపికైన బస్సేపల్లి,హంప, బురుజుల,యడవలి పంచాయతీ రాజ్ సెక్రటరీలను సన్మానించి పురస్కార పత్రం అందచేశారు. అలాగే మద్దికెరలో ఉన్న 4సచివాలయాలకు సంబంధించి ఉత్తమ సేవలందించిన నలుగురు వాలంటరీలను సన్మానించి పురస్కార పత్రం అందించారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందిని కూడా సన్మానించార

విద్యార్థి మృతిపై విచారణ- నలుగురిపై కేసు నమోదు

ముగ్గురిపై సస్పెషన్ వేటు - కాంట్రాక్ట్ ఉద్యోగులు తొలగింపు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ ,24 ప్రభాతవార్త : మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9 వ తరగతి చదివే విద్యార్థి నాగేష్ మృతిపై సోమవారం డిసిఓ శ్రీదేవి సమక్ష్యంలో నందికొట్కూరు రూరల్ సిఐ సుధాకర్‌రెడ్డి విచారణ చేపట్టారు. నాగేష్ ఏ సమయంలో పాఠశాల నుండి బయటకు వెళ్లారు. ఎవరితో కలిసి మృతుడు సమీపంలోని బావిలోకి ఈతకు వెళ్లారు. విద్యార్థి పాఠశాల నుండి బయటకు వెళ్లేటపుడు విధుల్లో వున్న సిబ్బందితోపాటు నాగేష్‌తోటి విద్యార్థులను కూడా సిఐ విచారించారించి వీడియోలు తీయించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థి తల్లిదండ్రులు ఐఎశ్వరి,రామకృష్ణలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రిన్సిపల్ రాజు, పిజికల్ డైరెక్టర్ గంగాధర్, వార్డెన్ గిరిధర్,హౌస్ మాస్టర్ ఏసేపులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సెక్రటరీ యోగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థి మృతిపై నిర్వహించిన సమగ్ర విచారణ నివేదికను డిసిఓ శ్రీదేవి గురుకులాల సెక్రటరీ పవన్‌కుమార్ సమర్పించారన్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ రాజు, పిఈటి లక్ష్మికాంతరెడ్డి, హౌస్ మాస్టర్ ఏసేపులను సస్పెషన్ చేస్తూ సెక్రటరీ పవన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అదే విధంగా తాత్కాలిక ఉద్యోగి,డ్యూటీ టీచర్ పార్థసారథి, సెక్యూరిటీ గార్డులు హరిబాబు,పెద్దన్నలను విధుల నుండి పూర్తిగా తొలగించామన్నారు. అదే విధంగా ఫిజికల్ డైరెక్టర్ గంగాధర్‌ను డిసిఓ కార్యాలయానికి సరండర్ చేసినట్లు డిప్యూటీ సెక్రటరీ తెలిపారు. హస్టల్‌ను డిసిఓ,డిప్యూటీ సెక్రటరీలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని వారు ఆరా తీశారు.

విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

కర్నూలు క్రైమ్,ఏప్రిల్ ,24,ప్రభాతవార్త :- స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా కృష్ణ కాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్పందన కార్యక్రమానికి సోమవారం మొత్తం 72 ఫర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని కోడుకు కోడలు బయటకు గెంటెయాలని 10 రోజుల నుండి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు ముజఫర్ నగర్ కు చెందిన బేగ్ ఫిర్యాదు చేశారు.నా భర్త చనిపోయాడు నా భర్త చెందిన ఆస్తి భాగం ఇవ్వకుండా నా మరిది ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు శరీన్ నగర్ కు చెందిన రాజేశ్వరి ఫిర్యాదు చేశారు.కర్నూలు ఎటిఎంలో డబ్బులు డ్రా చేయడానికి వెళితే ఒక వ్యక్తి నాకు డబ్బులు డ్రా చేసి ఇస్సానని చెప్పి ఎటిఎం కార్డు మార్చి మోసం చేశాడని కర్నూలు,కల్లూరు మండలలకు చెందిన యు లక్ష్మన్న ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు మా పెట్రోల్ బంకు కంపౌండ్ వాలును పగలకోట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని పెద్దటేకూరు కు చెందిన వి.మల్లికార్జున చౌదరి ఫిర్యాదు చేశారు.గురుకుల పాఠశాలలో టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకోని మోసం చేశాడని కర్నూలు బి తాండ్రపాడు చెందిన జ్యోతిర్మయి ఫిర్యాదు చేశారు.ఎస్ ఎల్ సి గ్లోబల్ ఇండియా లిమిటెడ్ ఫారెక్స్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే పర్సంటేజ్ ప్రకారం రెట్టింపు ఆదాయం వస్తుందని నమ్మించి నన్ను మోసం చేసిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కర్నూలు బాలజీ నగర్ కు చెందిన రామకృష్ణ ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటాద్రి లీగల్ అడ్వజైర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల టెక్కె, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః పంచాయితీరాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకొని కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించినకార్యక్రమంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జీ భూమా బ్రహ్మనందరెడ్డి, భూమా అఖిల ప్రియతో కలిసి పాల్గొన్నారు. యువగళం పాదయాత్ర కోసం ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సభా ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అలాగే నారా లోకేష్ యువగళం పాదయాత్ర 400 రోజులు, 4 వేల కిలోమీటర్లు చేపడుతున్న పాదయాత్రలో భాగంగా జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవంలో అభిమానులతో కలిసి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో నంద్యాల, గోస్పాడు మండలాల మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి లేదంటే మాటకు మాట .... : భూమా విఖ్యాత్‌రెడ్డి

నంద్యాల, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిని నోటిని అదుపులోపెట్టుకొని మాట్లాడాలని లేదంటే మాటకు, మాట చర్యకు ప్రతిచర్య తప్పదని టిడిపి యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి హెచ్చరించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విఖ్యాత్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల మెడికల్ కళాశాలను అడ్డుకునేందుకు ఏ టిడిపి నాయకులు కోర్టుకు వెళ్లారో నిరూపించాలని సవాల్ విసిరారు. అలాగే కానాల మీదుగా వెళ్లె హైవే పై మీరేందుకు అభ్యంతరం పెట్టలేదని అక్కడ మీకు మీ బాబాయికి సంబంధించిన స్థలాలు ఉన్నాయి కాబ్బట్టి ఆ జాతీయ రహదారి నిరా ్మణంపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయడం లేదన్నారు. నంద్యాల అభివృద్ధి చెందిదంటే అది కేవలం టిడిపి ప్రభుత్వంతోనే, భూమా కుటుంబంతోనే సాధ్యమయిందన్నారు. ఒకప్పుడు టిడిపిలో ఉన్న మీరు లోకేష్ అపాయింట్‌మెంట్ కోసం ఎన్నిసార్లు తిరిగారో ఆయన అపాయింట్‌మెంటు దొరికితే చాలు అనుకునే మీరు ఈరోజు లోకేష్ గురించి మాట్లాడేస్థాయి మీకు లేదన్నారు. ఎక్కడైతే మెడికల్ కళాశాల నిర్మించాలనుకున్నారో ఆ ప్రాంతంలో ఎంపీ, హాస్పటల్, హోటల్ ఉందని దాని పక్కనే ఎమ్మెల్యే స్థలాలు ఉండడంతో సొంత లబ్దికోసం గాలి మాటలు మాట్లాడుతున్నారన్నారు. లోకేష్ దళితులను కించపరిచినట్లు మాట్లాడుతున్నారని ఎక్కడైనా దళితులను కించపరిచినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్‌విసిరారు. మహిళా ఎమ్మెల్యేల గురించి లోకేష్ ఏదో మాట్లాడారని మీరు చెబుతుంటే విడ్డురంగా ఉందని మీ తండ్రి హయాంలో ముగ్గురు మైనార్టీ మహిళలను రేప్ చేసి హత్య చేసి కాల్వలో పడేస్తే ఇంతవరకు కేసులేదని ఎలాంటి విచారణ చేపట్టలేదని అలాంటి మీరు మహిళల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపినాయకులు ఎవిఆర్ ప్రసాద్, శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పీపుల్స్ సర్వేలో..... నేటికి కోటిగడపల్లో....

-జగన్ ప్రభుత్వ పరిపాలన అద్భుతం

-యువగళం పేరుతో నారా లోకేష్ యువత మోసానికి తెర

నంద్యాల క్రైం, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః మెగా పీపుల్స్ సర్వేలో నేటికి కోటి గడపల్లో చేరుకుందని జగనన్నపై విశ్వాసం, నమ్మకంగా ప్రభుత్వానికి మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్‌కాల్స్ వచ్చాయని దేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మెగా పీపుల్స్ సర్వే చేపట్టడం ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని నంద్యాల శాసన సభ్యులు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు.సోమవారం మార్కఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టి శ్రీదర్, కో-అప్షన్ సభ్యులు సలాముల్లాతో కలిసి ఎమ్మెల్యే స్వగృహంలో విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. వైసీపీ తరుపున ఈనెల 7వ తేది నుంచి గృహసారథులు చేపడుతున్న జగననే ్న మా భవిష్యతు జగన్ మా నమ్మకం రాష్ట్ర ప్రజల్లో ఉన్న ప్రతిస్పదనను తెలుసుకునేందుకు మెగా పీపుల్స్ సర్వేలో అపూర్వ స్పందన లభిస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన హామిల వాగ్దానాలు ప్రకటించి మ్యానుఫెస్టోను దైవంగా భావించి వందకు వందశాతం పథకాలు అమలుచేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్క లబ్దిదారుడు తమ సంతోషాన్ని వెల్లబుస్తున్నారని తెలిపారు. జగనన్నే మళ్లి రావాలి అధికారం చేపట్టాలి సంక్షేమ పథకాలు కొనసాగించాలని తెలిపారు. బాబు వస్తే జాబు వస్తాది అనే కానె ్సప్ట్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారని కాగ ఆయన తనయుడు నారా లోకేష్‌కు ఉద్యోగం ఇచ్చారు. కానీ ఇప్పుడు యుగళం పేరుతో మరోసారి నిరుద్యోగ యువతను మోసం చేయడానికి తెరలేపారని ఆరోపించారు. తండ్రి, తనయుడులు కలిసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర ్మన్ కైప రాముడు, అనిల్ అమృత్‌రాజ్, వైసీపీ నాయకులు బసవేశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులున్నారు.

బూత్ కమిటి కన్వినర్లే కీలకము ఎన్నికల్లో వైసిపి కుట్రలు క్షేదించండి-బిసి

కోవెలకుంట్ల,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : రాజకీయల నాయకులు ఎన్నికల్లో విజయం సాదించాలంటే బూత్ కన్వినర్లే కీలకమని 2024 ఎన్నికల్లో వైసిపి కుట్రలను క్షేదించాలని బనగానపల్లె మాజీ యంయల్ఎ బిసి జనార్దనరెడ్డి బూత్ కన్వినర్లకు దిశ దశ నిర్దేశము చేశారు.సోమవారము నియోజకస్థాయిబూత్ కన్వినర్లకు ఒక రోజు శిక్షణకార్యక్రమంలో కోవెలకుంట్ల పట్టణంలోని వియన్‌అర్ ఫంక్షన్ హాలను బిసి జనార్దరెడ్డి అద్యక్షతన నిర్వహించారు. ఉదయము అవుకు, బనగానపల్లె, సంజామల మండాలల్లోని బూత్ కన్వినర్లకు అలాగే సాయంత్ర 4గంటలకు కోవెలకుంట్ల కొలిమిగుండ్ల మండలాలకు సంబందించిన వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భమేగా వారిని ఉద్దేశించి బిసి మాట్లాడుతూ గత 2019 ఎన్నికల్లో డిజటల్‌పై సరి అయిన అవగాహణ లేక పోవడముతో అపజయం పాలు అయ్యామని అయితే 2024 ఎన్నికల్లో డిజిటల్‌పై ప్రతి బూత్ కార్యకర్త అవగాహణ పెంచుకోవాలని కోరారు. ముఖ్యంగా మన యాప్‌ను సద్వినియోగము చేసుకోవాలని కోరారు.ఈ ఎన్నికల్లో గెలువాలని వైసిపి బారీ కుట్రలకు తెరతీస్తున్నదని చెప్పారు. వారి కుట్రలను భగ్నము చేయాలంటే గ్రామాల్లో ఉన్న బూతత్ కమిటి సభ్యులు కన్వినర్లే చాలా కీలకమని చెప్పారు. ఎవరు ఎక్కడ అదౌర్య పడవద్దని కోరారు మన యాప్ ద్వారా మన పనితీరు జాతీయ పార్టి నాయకులు నిత్యము పక్యవేక్షిస్తున్నామని చెప్పారు. మనము బాదుడే బాదుడు కార్యక్రమంలో ముందున్నామని చెప్పారు. దానిలోనే కాకుండా అన్నింటిలో మనము ముందడాలని కోరారు.బూత్ కమిటి సభ్యులు పనితీరు చంద్రబాబునాయుడు అక్కడుండి కూడా చూస్తుంటారని చెప్పారు. ఈకార్యక్రమంలో అవుకు మండలనాయుడు కాటంరెడ్డి మల్లికార్జునరెడ్డి ఉగ్రసేనారెడ్డి, సంజామల మండల నాయకుల సురేషరెడ్డి గాందశెట్టి రమణ, అక్కంపల్లె రామసుబ్బారెడ్డి, బనగానపల్లె మండల నాయకులు,అలాగే కోవెలకుంట్ల నాయకుల మాజీ మార్కెట్ యాడు చైర్మన్ గడ్డంనాగేశ్వరరెడ్డి ,పొట్టిపాడు సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి మద్దిలేటి అబిరుచి మద్దిలేటి,పెనుగొండ రాజశేఖరు,సౌదరదిన్నె బ ండ్ల.దస్తగిరి,పెద్దకోపెర్ల వెంకటేశ్వరరెడ్డి,బుచ్చన్న, వల్లంపాడు జగదీశ్వరరెడ్డి లింగాలనాయుడు,కలుగొట్ల గడ్డంనాగార్జునరెడ్డి,ఎవిసుబ్బారెడ్డిధనుంజయ్‌యాదవ్,బిజినవేమలు రాదాకృస్ణా, వుశేని వుశేనయ్య, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిని నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

నంద్యాల హాస్పటల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః జిల్లాలో జీరో మలేరియా కేసులు నమోదు అయ్యేలా మలేరియా వ్యాధి నిర్మూలనకు పకడ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ వైద్యాధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో మలేరియా దినోత్సవాన్ని పురష్కరించుకొని జేసి నిశాంతి డిఎంహెచ్ఓ వెంకటరమణలతో కలిసి గోడప త్రికలను విడుదల చేశారు. ఈసందర ్భంగా కలెక్టరు మాట్లాడుతూ గత సంవత్సరం 8 మలేరియా కేసులు నమోదు అయ్యాయని ఈ ఏడాది కూడ ఒక్క కేసుకూడ నమోదు కాకుండా మలేరియారహిత జిల్లాగా తీసుకువచ్చేందుకు పకడ్బంది చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ మలేరియా అధికారులను అదేశించారు. మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్లి మలేరియా వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని వ్యాధి ప్రభల కుండా దోమల నివారణకు ప్రత్యేక చర్యలుచేపట్టి మురుగు కాల్వల్లో నీరు నిల్వఉండకుండా ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్ల ఉండకుండా చర ్యలు చేపట్టాలన్నారు. మురుగుకాల్వల్లో కిరోసిన్, ఇంజన్‌అయిల్‌ను చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా, మలేరియా అధికారి కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమపథకాలు అందిస్తున్నాం : ఎమ్మెల్యే

క్రిష్ణగిరి,ఏప్రిల్24,ప్రభాతవార్త : కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమపథకాలను అందిస్తున్నామని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.మండలంలోని తొగర్చేడు గ్రామంలో,యాగంటిపల్లి,తుమ్మలకొత్తూరు సోమవారం ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె అవ్వతాతలను,మహిళలను అప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమపథకాలకు సంబంధించిన కరపత్రాలను వారికి అందించారు.మీకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడుగగా జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక,మీరు మాకు ఎమ్మెల్యేగా వచ్చాక అందుతున్నాయని వారు సమాధానం ఇచ్చారు.ఇది ఇలాగే కొనసాగాలంటే మీరంతా జగనన్నను,నన్ను మీ ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు.అనంతరం తొగర్చేడు గ్రామంలో ఆమె పత్తికొండ నియోజకవర్గ కన్వీనర్లు మండల కన్వీనర్లు,సచివాలయం గృహసారథుల మండల కన్వీనర్లతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెలే ్య శ్రీదేవి మాట్లాడుతూ కుల,మత,వర్గ,వివక్ష లేకుండా ప్రతిపక్షాలు బలంగా ఉన్నాయని భావించే ప్రాంతాలపై దృష్టి సారించి జగనన్న పాలనలో అక్కడి ప్రజలకు జరిగిన మంచిని వివరించాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్‌సిపి ముందుకు వెళుతుందన్నారు.జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేలోని తొలి 15 రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొనగా సిఎం జగనన్న పాలనకు మద్దతుగా 79 మిస్స్‌డ్ కాల్స్ వచ్చాయన్నారు.రాష్ట్రంలోని మొత్తం 1కోటి 65లక్షల కుటుంబాలకు 100 శాతం సందర్శించడం జరిగిందన్నారు.పత్తికొండ నియోజకవర్గంలో దాదాపుగా 58,232 కుటుంబాలను సందర్శించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు.మాకు ఏ ప్రభుత్వంలో ఇలా ఇంటివద్దకు పథకాలు రాలేదని,ఒక్క జగనన్న ప్రభుత్వంలోనే మాకందరికి ప్రభుత్వపథకాలు వస్తున్నాయని వారు చెప్పడం ఎంతో శుభపరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి ఎంపిపి కంగాటివెంకటరామిరెడ్డి,వెల్దుర్తి మండల వైకాపా బొమ్మనరవిరెడ్డి,సచివాలయం గృహసారథుల మండల కన్వీనర్ సమీర్‌రెడ్డి,వెల్దుర్తి జడీ ్పటిసి సుంకన్న,వైకాపా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంక్‌ని కూల్చి కొత్త ట్యాంక్‌ను నిర్మించండి

కర్నూలు రూరల్,ఏప్రిల్ 24,ప్రభాతవార్త : వెంకాయపల్లె గ్రామంలో జొహరాపురం రోడ్డు నందు ప్రాథమిక స్కూల్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ మంచినీటి సరఫరా ట్యాంకును కూల్చి కొత్త ట్యాంకును నిర్మించాలని వెంకాయపల్లె గ్రామస్తులు ఎల్లరాజు,చిన్నయ్య,వైసిపి నాయకులు బజారిలు అధికారులను కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ మంచినీటి సరఫరా ఉపరితల ట్యాంకు దాదాపు 40అడుగుల ఎత్తులో ఉంటుందని ఈ ట్యాంకు నుండి పదేళ్లుగా మంచినీరు సరఫరా అవుతుందన్నారు. అయితే ఈ ట్యాంకుకు పెచ్చులూడి పిల్లర్లు దెబ్బతిని నాసిరకంగా ట్యాంకు బలహీనంగా తయారైందని దీనికి కేవలం ఆరడుగుల నుండి పది అడుగుల దూరంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల,సుంకులమ్మ అమ్మవారి ఆలయం ఉన్నందున ఇక్కడ స్కూల్ పిల్లలు మరియు అమ్మవారి దేవాలయానికి వచ్చే భక్తులు ఉండే సందర్భంలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు వాతావరణ పరిస్థితిలో రీత్యా ఉరుములు,మెరుపులు లేదా బలమైన గాలులు వీచినప్పుడు ఈ ట్యాంకు కూలి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి ఈ ఉపరితల మంచినీటి ట్యాంకును పరిశీలించి ఈ ట్యాంకు స్థానంలో నూతన ట్యాంకును నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

శ్రీశైలం మల్లన్నకు సహస్రదీపార్చనలు

శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్24,ప్రభాతవార్త : శ్రీశైలక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సోమవారసేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.రాత్రి ఉభయదేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో సా ్వమిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు సహస్రదీపార్చన జరిపారు.ముందుగా ఉత్సవరులకు ప్రత్యేక అర్చనలు,హరతి పూజలు జరిపి తదుపరి వెయ్యి దీపాలు వెలిగించి దీపార్చన నిర్వహించారు.అనంతరం ఉభయదేవాలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవ సేవ జరిపారు.మల్లన్నకు అత్యంత ప్రీతికరమైన రోజుగా భావించే సోమవారం స్వామిఅమ్మవార్లకు శాస్త్రబద్ధంగా దీపార్చన, వెండిరథసేవలు నిర్వహించడం ఆనవాయితి.ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈఓ ఎస్.లవన్న,అదికారులు,అర్చకస్వాములు,వేద,ఆగమ పండింతులు పాల్గొనా ్నరు.

ముఖ్యమంత్రి జగన్ పాలన అద్భుతంగా సాగుతుంది : ఏమ్మేల్య్ శిల్పా రెండవ రోజు సాగిన ఏమ్మేల్య్ శిల్పా పర్యటన

శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్24,ప్రభాతవార్త : ఏపి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మొహన్‌రెడ్డి పాలన అద్భుతంగా సాగుతుందని శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మేల్య్ శిల్పాచక్రపాణిరెడ్డి పునర్దుఘాటించారు.ఈక్రమంలోనే శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మేల్య్ శిల్పాచక్రపాణిరెడ్డి పర్యటన సుండిపెంటలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అశేష జనవాహిన నడుమ జననీరాజానీలు అందుకున్నారు.అడుగడుగున కాలనీ వాసులు అప్యాయతతో పలకరిస్తు చిరునవ్వులతో ఆహ్వానాలు పలికారు.సమస్యల పరిస్కార దిశగా ఏమ్మేల్య్ ప్రజల నుండి వివారాలు అడిగితెలుసుకుంటూ వాటిని పరిస్కారం వైపు అదికారులకు సూచనలు చేయడం జరుగుతుంది.మీరు ఎలా ఉన్నారు,జగన్నన్న పథకాలు అందరికి అందుతున్నాయా,వాటి ద్వారా సంతృప్తిగా ఉన్నారా,రాబోయే ఎన్నికల్లో ఓటు ఎవరికి వేస్తున్నారు,అంటూ మీ అందరికి అండగా ఉండే వారిని గుర్తుంచుకోని ఓటుతో ఆశీర్వాదించాలని పర్యటనలో ప్రజలకు తెలిపారు.అదే విధంగా శ్రీశైలం డ్యాం వద్ద విలేఖర్ల సమావేశంలో మాట్లడుతూ నియేజకవర్గంలో,రాష్ట్రంలో ప్రజల అమొదం ఉండడంతోనే ప్రజలు మా నమ్మకం నీవే జగనన్న అనే స్టికర్లు ప్రతి ఇంటికి అంటించుకొవడం జరుగుతుందని అన్నారు.ఈ రాష్ట్రంలో జగన్‌మొహన్‌రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పాలన కొనసాగుతుందని వ్యాక్యనించారు. యువగళంలో అక్కడి వారు ఇచ్చిన స్క్రిప్పును నారా లోకేష్ చదువుతున్నారని ఎద్దేవ చేసారు.యువగళంలో పాల్గొనే వారికి దినసరి కూలిలు ఇచ్చి తిప్పుకుంటున్నారని వ్యాక్యనించారు.టిడిపి పార్టిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని జోష్యం చేప్పారు.శ్రీశైలం నియేజకవర్గంను మరింత అభివృద్ధి దశలో ముందుకు తీసుకుపోయే విధంగా తాను పనిచేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏంపిడిఓ మొహన్‌కుమార్,మండల తహశీల్దార్ రాజేంద్రసింగ్,ఏపిఎస్‌పిడిసిఎల్ ఏఈ సత్యనారయణ,పంచాయితీరాజ్‌శాఖ అదికారులు,శ్రీశైల మండలం వైసిపి నాయకులు భరత్‌రెడ్డి,వెంకటరెడ్డి,రజాక్,గుండయ్య,ఎస్.సి నాయకులు వినుకొండ యేసు,బుదాల దానియేలు,తంగిరాల సంజీవయ్య,ప్రవిణ్,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బిసిలను టిడిపికి దూరం చేయాలనే ఉద్దేశ్యంతోనే వైసీపీ తప్పుడు కథనాలు

కర్నూలు న్యూసిటి, ఏప్రిల్ 24, ప్రభాతవార్తః తెలుగుదేశం పార్టీకి బిసిలను దూరం చేయాలనే ఉద్దేశ్యంతోనే వైసీపీ నాయకులు తప్పుడు కథనాలు చిత్రీకరిస్తున్నారని టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వై నాగేశ్వర్‌యాదవ్ విమర్శించారు. సోమవారం కర్నూలులో మానవహక్కుల సంఘం కార్యాలయం ఎదుట బిసి సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వర్‌యాదవ్, టిడిపి నాయకులు గరుమూర్తి, నరసింహులు, బిసిసెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, బిసి సెల్ ఉపాధ్యక్షులు తిరుపాల్‌బాబు, మహిళా నాయకులు గుడిసె కృష్ణమ్మ, వసంత లక్ష్మీ, కార్పొరేటర్ పరమేష్, మహేష్‌గౌడ్, అనుదీప్ తదితరులు కలిసిన సమావేశంలో నాగేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ కరుడుగట్టిన వైసీపీ నాయకుడు కడప జిల్లా వాసి అన్విత్ కృష్ణారెడ్డి, వైసీపీ సోషల్ మీడియా భార్గవ్‌రెడ్డి ప్రధాన అనుచరుడు అన్విత్ కృష్ణారెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి బ్యాక్‌గ్రౌండ్‌లో చంద్రబాబు పోటోను ఉంచి మెడలో కండువా వేసుకొని దళితులను, మహిళలను, బిసిలను తిడుతూ ఉంటాడు. ఇదంతా చంద్రబాబు నాయుడు చేపిస్తున్నారని, అన్ని వర్గాలు తెలుగుదేశం పార్టీకి దూరం కావాలని ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారు. ఈసందర్భంగా మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తప్పుడు చిత్రాలను వక్రీకరించి సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన వాళ్ళను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశామన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

త్వరలోనే షాదిఖానా నిర్మిస్తాం - చల్లా విఘ్నేశ్వరరెడ్డి

అవుకు,ఏప్రిల్24,ప్రభాతవార్త: అవుకు పట్టణంలోని చల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ ముస్లిం మతపెద్దలు మరియు ముస్లిం సోదరులు సోమవారం అవుకు మండల అధ్యక్షులు చల్లా రాజశేఖర్‌రెడ్డిని మరియు వైసీపీ యువనాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డిలను కలిసి వారి యొక్క సమస్యలు వివరించారు.వారి సమస్యలైనా ఖబరస్తాన్ దగ్గర మరియు ఈద్గా ప్రాంతం దగ్గర ప్రహరిగోడలను నిర్మించాలని మరియు షాదిఖానా నిర్మించడానికి అవసరమైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.వారి సమస్యలు విన్నా చల్లా రాజశేఖర